




నిధులు రాక.. నిలువలేక!

మూతపడుతున్న ప్రైవేటు కళాశాలలు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో జాప్యం
- ఉమ్మడి జిల్లాలో రూ.21.60 కోట్ల బకాయిలు
- మూడేళ్లుగా ఆగిపోయిన చెల్లింపులు
- పేద విద్యార్థులకు దూరమవుతున్న ఉన్నత విద్య
- ప్రభుత్వం స్పందించాలంటున్న యాజమాన్యాలు

హనుమకొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రవేశ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్రమంగా వారు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నిర్వహిస్తున్న ప్రైవేటు కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. దీనికి సంబంధించి బీసీ, ఈబీసీ విద్యార్థుల బకాయిలే ఎక్కువగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో రూ.21.60 కోట్ల మేరకు బకాయిలు పేరుక పోయాయి. వీటిని కొత్త ప్రభుత్వమైనా చెల్లిస్తుందా అన్న ఆశతో విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

రూ. 21.60 కోట్ల బకాయిలు

హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్, ఇతరత్రా బీసీ, ఈబీసీ విద్యార్థులకు సంబంధించి మొత్తం సుమారు రూ. 21.60 కోట్ల వరకు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో రూ. 3 కోట్లు, వరంగల్ జిల్లాలో 4.40 కోట్లు, మహబూబాబాద్ జిల్లాలో 4.60 కోట్లు, జనగామ జిల్లాలో 3.60 కోట్లు, ములుగు జిల్లాలో 2.40 కోట్లు, జయశంకర్ జిల్లాలో 3.60 కోట్లు ఉన్నాయి. ఇవేకాకుండా నెలవారి ట్యూషన్ ఫీజులు పాఠశాలలకు సంబంధించి రూ 6.42 కోట్ల మేరకు బకాయిలు ఉన్నాయి. కాగా, కళాశాలలకు రూ.9.35 కోట్ల బకాయిలు ఉన్నాయి. గత ఏడాది బకాయిలు ఉండడంతో కొత్తగా 2023-24 సంవత్సరానికి సంబంధించిన బకాయిల పరిస్థితి ఏమిటన్న సందిగ్ధంలో విద్యార్థులు ఉన్నారు. గత ఏడాది 2021-22 సంవత్సరం నాటి బకాయిలను గత రాష్ట్ర ప్రభుత్వం 2022 ఆగస్టులో విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. వాటికి సంబంధించిన బిల్లులను ట్రెజరీలో సమర్పించిన విడుదల కాలేదు. 2022-23 బకాయిలు అసలు ఎస్టీలకే చేరలేదు.

2023-24వి కూడా...

తాజాగా 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపకార వేతనాలు, రీయింబర్స్‌మెంట్ కోసం గత సంవత్సరం డిసెంబర్ నెలాఖరులోగా విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. చెల్లింపులు ఎప్పుడు జరుగుతాయనీ ఆశగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కనీసం ఇప్పుడైనా బకాయిలు విడుదలవుతాయన్న ఆశతో ఉన్నారు. కానీ ఇప్పటి వరకు బకాయిల చెల్లింపునకు సంబంధించిన సంకేతాలే వెలువడడం లేదు. ఇంకో రెండు నెలలైతే ప్రస్తుత విద్యా సంవత్సరం కూడా పూర్తవుతుంది. ఆ తర్వాత సెలవులు. పాఠశాలలు, కళాశాలలు తిరిగి తెరుచుకునే సమయానికి పార్లమెంట్ ఎన్నికల హడావుడి ఉంటుంది. అప్పుడు రియింబర్స్‌మెంట్ బకాయిలపై దృష్టిపెట్టే అవకాశం ప్రభుత్వానికి ఉండదు. బకాయిల వివరాలను కొత్త ప్రభుత్వానికి అందచేశామనీ, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిధులను విడుదల చేస్తుందని ఆశిస్తున్నామనీ, నిధులు రాగానే చెల్లిస్తామని బీసీ సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఉపకారవేతనాలే దిక్కు

పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉపకార వేతనాలపై ఆధారపడి విద్యాభ్యాసం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు స్కాలర్‌షిపులు రాకపోతాయా, ఫీజు రీయింబర్స్‌మెంట్ జరక్కపోతుందా అన్న నమ్మకంతో పట్టణాలకు వచ్చి ప్రభుత్వ, ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. తల్లిదండ్రులు కూడా ఇదే భరోసాతో వారిని ఉన్నత చదువులకు పట్టణాలకు పంపుతున్నారు. 2022-23 విద్యా సంవత్సరానికి సబంధించి ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. కేవలం రీయింబర్స్‌మెంట్ మీదే ఆధారపడి చదువు చెబుతున్న ప్రైవేటు ఇంటర్మీడియట్ కళాశాలలు ఉమ్మడి జిల్లాలో 258 ఉన్నాయి. వీటిలో సుమారు 82 వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో ఎక్కువ ఎస్సీ, ఎస్టీ, బీసీలే. విద్యార్థులను కళాశాలలో చేర్చుకునే సమయంలో రీయింబర్స్‌మెంట్ రాకపోతే విద్యార్థులే చెల్లించాలన్న నిబంధనలు కళాశాల యాజమాన్యాలు పెడుతున్నాయి.

సర్టిఫికెట్లకు బ్రేక్

ప్రభుత్వం సకాలంలో రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు టీసీలు, ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయి. పై చదువులు పూర్తి చేసి ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు వాటిని సంబంధిత కంపెనీల్లో సమర్పించే విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సకాలంలో సమర్పించకపోతే ఉద్యోగం పోయే పరిస్థితిని వారు ఎదుర్కొంటున్నారు. పై చదువుల కోసం ఆయా ఉన్నత కళాశాలల్లో ప్రవేశాలు పొందగోరే విద్యార్థులకు సైతం ఈ తిప్పలు తప్పడం లేదు. ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వాల్సిందిగా కాలేజీకి వెళ్లి విద్యార్థులు అడిగితే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు అందలేదని, ఆ నిధులు వచ్చాకే సర్టిఫికెట్లు ఇస్తామని కాలేజీలు కొర్రీ పెడుతున్నాయి. లేదంటే ఫీజు సొమ్ము చెల్లించి సర్టిఫికెట్లు తీసుకుపోవాలని సలహా ఇస్తున్నాయి. దీంతో పేద విద్యార్థులు విధిలేని పరిస్థితుల్లో బయట అప్పులు చేసి డబ్బులు కట్టి సరిఫికెట్లు తీసుకోకతప్పడం లేదు. చేసిన అప్పులకు నెలనెలా వడ్డీ కట్టాల్సి వస్తోంది. ప్రభుత్వం నిధులు ఎప్పుడు విడుదల చేస్తుందో అని ఎదురుచూస్తున్నారు.

బీసీ, ఈబీసీ విద్యార్థులవే పెండింగ్

పోస్టు మెట్రిక్(కళాశాలల విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో ఎక్కువగా బీసీ కేటగిరీకి చెందిన నిధులే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అమలు చేస్తున్న ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి నుంచి ఆయా సంక్షేమ శాఖల నిధులను రీయింబర్స్‌మెంట్ పథకానికి ఖర్చు చేస్తుండగా బీసీ, ఈబీసీ విద్యార్థులకు సంబంధించిన నిధులు మాత్రం విడుదల కాని పరిస్థితి ఉంది.

ఇక్కట్లలో ప్రైవేటు కాలేజీలు

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల్లో జాప్యం వల్ల వాటినే నమ్ముకొని నడుస్తున్న ప్రైవేటు కాలేజీలు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. పలు ఇంటర్మీడియట్, డిగ్రీ కాలేజీలు, ఇంజనీరింగ్ కాలేజీలు క్రమంగా మూతపడుతున్నాయి. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 20కిపైగా ఇంటర్మీడియట్ కాలేజీలు, 7 డిగ్రీ కాలేజీలు, 28 ఇంజనీరింగ్ కాలేజీలు మూతపడ్డాయి. మరొకొన్ని మూతపడే స్థితిలో ఉన్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వస్తే ప్రైవేటు కాలేజీలకు కాస్త ఊరట లభించేంది. కానీ మూడేళ్ల నుంచి నిధులు విడుదల కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టు మిట్టాడుతున్నాయి. 2020-21, 2021-22, 2022-23 విద్యా సంవత్సరాలకు సంబంధించి చాలా బీఆర్‌వోలు (బడ్జెట్ రిలీజింగ్ ఆర్డర్లు) జారీ అయ్యాయి. కానీ నిధుల విడుదల కాగితాలకే పరిమితమైపోయింది.



తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

మనోళ్లే ఓడించిన్రు..

- పక్కనే ఉండి సహకరించలే...
- అధిష్ఠానం ముందు ఓటమి నేతల గోడు
- తెలంగాణ భవన్‌లో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశం
- పాల్గొన్న ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నేతలు, కార్యకర్తలు
- దిశానిర్దేశం చేసిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదామని పిలుపు

హనుమకొండ టౌన్, జనవరి 10 : పక్కనే ఉంటూ సొంత పార్టీ నేతలే వెన్నుపోటు పొడిచారని, తమ వెంటే ఉంటూ వ్యతిరేకంగా పని చేశారని, తమ ఓటమికి పొరుగు పార్టీ వారికంటే సొంత పార్టీ వారే కారణమని ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఓటమి చెందిన బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ, తూర్పు, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, పరకాల, భూపాలపల్లి, పాలకుర్తి నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఇటీవల ఓటమి చెందిన నేతలు, కార్యకర్తలు కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడారు. ఓటమికి గల కారణాలపై పలువురు నేతలు సొంతపార్టీ వారిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యేలు సైతం కింది స్థాయి క్యాడర్‌ను పట్టించుకోలేదని పలువురు అధిష్ఠానం దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యేలు కొంత మందిని కోటరీగా ఏర్పాటు చేసుకుని కార్యకర్తలను విస్మరించారని ఆరోపించారు. భూపాలపల్లి, వరంగల్ తూర్పు నియోజకవర్గాల నుంచి పోటీ చేసి ఓటమి చెందిన గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్‌లు సొంత పార్టీ నేతలపై ఆరోపణలు చేశారు. తన వెంటే ఉంటూ అపోజిషన్ పార్టీ అభ్యర్థికి మద్దతు తెలిపారని గండ్ర వెంకటరమణారెడ్డి పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులకు వారు కోరుకున్న దానికంటే ఎక్కువ చేసినప్పటికీ బీఆర్ఎస్‌ను వ్యతిరేకించారని ఆరోపించారు. తమ నియోజకవర్గంలో కార్పొరేషన్ చైర్మన్‌లు, ముఖ్య నేతలు, పటిష్టమైన క్యాడర్ ఉన్నప్పటికీ ఓటమి చెందడం విడ్డూరంగా ఉందని నన్నపునేని నరేందర్ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యులు ఎవరు కూడా తన కోసం పని చేయలేదని ఆరోపించారు. తన ఓటమికి సొంత పార్టీ ముఖ్య నేతలే కారణమని నన్నపునేని నరేందర్ సమావేశంలో పేర్కొన్నారు.

తన నియోజకవర్గంలో ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి బీఆర్ఎస్ పై ప్రజల్లో వ్యతిరేకత కనిపించిందని దయాకర్‌రావు తెలిపారు. వర్ధన్నపేట, పరకాలలో బీఆర్ఎస్ ఓటమి చెందుతుందని ఎవరూ ఊహించలేదన్నారు. వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నుంచి ఓటమి చెందిన దాస్యం వినయభాస్కర్, అరూరి రమేశ్ మాట్లాడుతూ.. తమ నియోజకవర్గాల్లో ఉన్న ఉద్యోగులు బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపలేదన్నారు. తమ ఓటమికి ఉద్యోగుల ఓట్లు ప్రధాన కారణమన్నారు. నేతల మధ్య సమన్వయం లోపించిందని, క్యాడర్ అసంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమావేశంలో పేర్కొన్నారు. పార్టీ నిర్మాణం చేపట్టి క్యాడర్‌కు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని కడియం పేర్కొన్నారు. లేదంటే పార్టీ మనుగడ ప్రమాదంగా మారే అవకాశం ఉంటుందని అన్నారు. ఇలా ప్రతీ ఒక్కరు వారి అభిప్రాయాలను సభలో వెల్లడించడం గమనార్హం.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం : కేటీఆర్

త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. అధిష్ఠానం ప్రకటించిన అభ్యర్థి గెలుపుకోసం ప్రతీ ఒక్కరు పని చేయాలని ఆయన వరంగల్ నేతలకు సూచించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో జరిగిన తప్పులను సరిదిద్దుకుని ముందుకు పోదామన్నారు. పార్టీ నిర్మాణం చేపట్టి క్యాడర్‌ను కాపాడుకుంటామని ఆయన తెలిపారు. అధికార పార్టీ తప్పులను ఎండగడుతూ ప్రజల పక్షాన నిలువాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. కాగా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మూడు బస్సుల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశానికి తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ పార్టీ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

వరంగల్ కలెక్టరేట్, జనవరి 10: వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలోని అర్హులైన పట్టభద్రులు ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ దిశగా రాజకీయ పార్టీలు, నాయకులు అవగాహన కల్పించాలని కోరారు. ఓటు నమోదు దరఖాస్తు స్వీకరణ చివరి తేది ఫిబ్రవరి 6 అని, ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన 24న, 24 నుంచి మార్చి 14 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. అలాగే అభ్యంతరాల పరిష్కారం అనంతరం మార్చి 29వ తేదీతో పాటు తుది జాబితా ఏప్రిల్ 4న విడుదల చేస్తామన్నారు. ఫిబ్రవరి 6 వరకు ఓటరుగా నమోదుకు అవకాశం ఉంటుందన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు.

మత్తు పదార్థాల నివారణకు చర్యలు తీసుకోండి

- అధికారులతో సమీక్షలో కలెక్టర్ ప్రావీణ్య
- కాలేజీల్లో కమిటీలు, కాలనీల్లో ఫిర్యాదుల బాక్సుల ఏర్పాటు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, జనవరి 10 : మత్తు పదార్థ రహిత జిల్లాగా వరంగల్‌ను తీర్చిదిద్దడం అధికారుల సమన్వయంతోనే సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా, డ్రగ్స్ ముప్పును రూపుమాపడానికి బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో యాంటినార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. నార్కోటిక్స్ ఆధ్వర్యంలో బృందాలను నియమించడం, మేజర్ కాలనీలలో గస్తీ ముమ్మరం చేయాలని గత సమావేశంలో జరిగిన అంశాలపై ఈ సందర్భంగా సమీక్షించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా కాలేజీల్లో విద్యాశాఖ అవగాహన సదస్సుల ద్వారా నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ద్వారా కాలేజీలు, రైల్వే స్టేషన్, బస్టాండ్ల ప్రాంతాల్లో అసాంఘీక కార్యకలాపాలు జరుగకుండా నివారిస్తున్నట్లు చెప్పారు.

జిల్లాలో ఇప్పటి వరకు 30 కేసులను నమోదు చేశామని, పోలీసు శాఖ ద్వారా కొన్ని గుర్తించిన ప్రత్యేక ఏరియాల్లో మిల్స్‌కాలనీ, శివనగర్, మట్టెవాడ ఏరియాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా మత్తు పదార్థాలకు బానిసై ఆస్పత్రికి వచ్చి చికిత్స తీసుకునే వారి అభిప్రాయాన్ని సేకరించాలని సూచించారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జరిగే అనారోగ్య సమస్యల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఛత్తీస్‌గఢ్, మల్కన్‌గిరి, చింతూరు, భద్రాచలం ఏరియాల నుంచి గంజాయి అక్రమ రవాణా జరుగకుండా పోలీసు యంత్రాంగం నిర్మూలనకు చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా గంజాయి పంటను పండించడం, రవాణా చేయడం గాని జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీసీపీ రవీందర్, వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్, విద్యాశాఖ అధికారి వాసంతి, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటరమణ, వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.లక్ష్మా నాయక్, నార్కోటిక్స్ సీఐ సురేష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకుడా సెలవిక..

- అశ్రునయనాల నడుమ రామా శ్రీనివాస్ అంత్యక్రియలు
- వేలాది మంది అభిమానులతో కొనసాగిన అంతిమ యాత్ర



నివాళులర్పిస్తున్న కెప్టెన్ లక్ష్మీకాంతరావు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 10 : స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో సమాజానికి, ప్రజలకు నిరంతరం సేవలందించిన రామా శ్రీనివాస్ కానరాని లోకాలకు వెళ్లిపోయారు. హైదరాబాద్‌లో మంగళవారం ఉదయం గుండెపోటుతో రామా శ్రీనివాస్ మృతి చెందగా, భౌతికకాయాన్ని రాత్రి వరంగల్‌కు తరలించారు. తిమ్మాపూర్ క్రాస్ రోడ్డులోని సిల్వర్ క్రౌన్ హైస్కూల్‌లో భద్రపర్చారు. బుధవారం ఉదయం ప్రముఖులు, ప్రజలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించారు. అక్కడి నుంచి సాయంత్రం రామన్నపేటలోని మోక్షారామం వరకు పూలమాలలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై శ్రీనివాస్ భౌతికకాయాన్ని ఉంచి డప్పుచప్పుళ్లతో అంతిమ యాత్ర కొనసాగింది. అమ్మ ఒడి వద్ద ఆయన పార్థివ దేహాన్ని మోక్షారామం ఫౌండేషన్ సభ్యులు, అమ్మ ఒడి కుటుంబ సభ్యులు కడసారి దర్శించుకున్నారు. శ్మశానవాటికలో అమ్మ ఒడి కుటుంబ సభ్యులు, అభిమానులు, స్నేహితుల అశ్రునివాళుల నడుమ అంత్యక్రియలు జరిగాయి. ఆయన కుమారుడు రామా శైలేష్ తండ్రి చితికి నిప్పంటించారు.

ప్రముఖుల నివాళులు..

రామా శ్రీనివాస్ భౌతికకాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. మాజీ మంత్రులు చంద్రశేఖర్, లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, బీజేపీ నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు చిలుకమారి సంజీవ, చాంబర్ సభ్యులు, వివిధ వ్యాపార సంఘాల అసోసియేషన్ల సభ్యులు, పలువురు వైద్యులు, హనుమకొండ కలెక్టరేట్ ఏవో కుసుమ సత్యనారాయణ, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, పద్మశాలీ సంఘం నాయకులు ఆడెపు రవీందర్, వడ్నాల నరేందర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, పోపా అధ్యక్షుడు డాక్టర్ రాజేశ్వరప్రసాద్, ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, ప్రైవేటు స్కూల్స్ యాజమానులు, పద్మశాలీ సంఘం సభ్యులు, నాయకులు శ్రీనివాస్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

అగ్రంపహాడ్ జాతరకు ఏర్పాట్లు చేయండి

- సమీక్షలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

6



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

- ఏఐటీయూసీ కేంద్ర కమిటీ కార్యదర్శి నర్ర ప్రతాప్

6లో..

కేయూ పరీక్ష కేంద్రాలను సందర్శించిన వీసీ రమేశ్

కేయూ క్యాంపస్, జనవరి 10: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో కేయూ క్యాంపస్‌లోని బయో టెక్నాలజీ విభాగంలో నిర్వహిస్తున్న పీజీ మూడో సెమిస్టర్ పరీక్ష కేంద్రాలను బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ పరిశీలించారు. విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా సుబే దారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, నగరంలోని గీతాం జలి, మాస్టర్‌జీ, సిటీ మహిళా కళాశాల పరీక్ష కేంద్రాలను కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణా ధికారి ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ పోడేటి శ్రీనివాస్, డాక్టర్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్

కేయూ క్యాంపస్, జనవరి 10: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ రెండో ఏడాది మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 18 నుంచి జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అధనపు పరీ క్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు బుధవారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. రెగ్యులర్, ఎక్స్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

బీపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు..

కేయూ పరిధిలో బీపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు జనవరి 18, 20, 22, 24 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం వరకు జరుగు తాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు బుధవారం తెలిపారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ హాజరుకావాలన్నారు.

కేసముద్రంలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌ను పరిశీలిస్తాం

▸▸ రైల్వే పీసీసీఎం రవీన్‌కుమార్ రెడ్డి


కేసముద్రం రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న రైల్వే పీసీసీఎం రవీన్‌కుమార్‌రెడ్డి

కేసముద్రం(మహబూబా బాద్ జిల్లా), జనవరి 10 : కేసముద్రం రైల్వేస్టేషన్‌లో మణుగూర్, ఇంటర్‌సిటీ, కరీం నగర్ ఎక్స్‌ప్రెస్‌ల హాల్టింగ్‌ను పరిశీలించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్(పీసీ సీఎం) కె.రవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్ ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన వ్యాపారులు, ఉద్యోగులు, ప్రయాణికులు ఆయనకు రైళ్ల హాల్టింగ్‌పై విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందిస్తూ పరిశీలిస్తామని, త్వరలో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటే మూడో లైను నిర్మాణంతోపాటే ప్లాట్‌ఫాంలపై ఫుల్‌కవర్‌షెడ్లు, డిస్‌ప్లే బోర్డులు, రెండో ప్లాట్‌పై ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మిషన్(ఏటీవీఎం)ను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. వరంగల్‌కు అప్‌అండ్‌డౌన్ చేసే వారు మహబూబాబాద్ నుంచి కాకుండా కేసముద్రం నుంచి సీజన్ టికెట్లు తీసు కోవాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ పీసీసీఎం భాస్కర్, సీని యర్ డీసీఎం బస్వరాజ్, స్థానికులు వోలం శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, తొను పునూరి భాస్కర్, బచ్చు లక్ష్మీనారాయణ, బోనగిరి ఉపెందర్ ఉన్నారు.

మేడారంలో ముందస్తు మొక్కులు


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 10 : తాడ్వాయి మండలం మేడారం వనదేవతల సన్ని ధిలో సందడి నెలకొంది. మహాజాతరకు ముందుగానే భక్తులు భారీ సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకుంటు న్నారు. బుధవారం సుమారు 30 వేల మంది తల్లుల దర్శ నాలు చేసుకున్నారు. తెలంగాణలోని నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. ముందుగా ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకొని అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె సారె, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం) సమర్పించారు. చల్లగా చూడా లని వేడుకున్నారు.


ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు


సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు


ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్


ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని


ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి


ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సినీనటి అనన్య


ముగ్గులు వేస్తున్న మహిళలు



అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

ఐనవోలు జాతరలో వాకిటాకీ సేవలు

ఐనవోలు, జనవరి 10: ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరలో దేవస్థానం అధికారులు వాకిటాకీ సేవలు అందుబాటులోకి తెచ్చారు. గతంలో పోలీస్ అధికారులు, సిబ్బంది మాత్రమే వాకిటాకీల ద్వారా బందోబస్తు విధులు నిర్వర్తించేవారు. గత జాతర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ సారి ఆ సమస్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు క్యూలైన్లు, తాగునీరు, పారిశుధ్యం పరిశీలన, బోనం, పట్నాల టిక్కెట్ల విక్రయాలు, లడ్డుప్రసాదం అమ్మకాల వద్ద భక్తుల రద్దీ తదితర అంశాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేవిధంగా ఆయా విభాగాలు చూసే

నేడు ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల బంద్

వడ్డెపల్లి, జనవరి 10 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నల్లచట్టానికి నిరసనగా గురువారం వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఓరుగల్లు ప్రైవేటు విద్యాసంస్థల బస్సు డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దొడ్డిపాటి సారయ్య, ప్రధాన కార్యదర్శి బండి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023 చట్టంలో భాగంగా డ్రైవర్‌లపై మోపిన చట్టం వలన డ్రైవర్లకు 10 సంవత్సరాలు జైలు శిక్షా, రూ. 7 లక్షల జరిమానాను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బస్సు డ్రైవర్స్, క్లీనర్స్ ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు కేయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కేయూ క్యాంపస్, జనవరి 10: ఈనెల 12 నుంచి 16 వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే 27వ నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు కేయూ జాతీయ సేవ పథకం(ఎన్ఎస్ఎస్) విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, కేయూ ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణలు ప్రత్యేకంగా అభినందించారు. నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు ఎంపికైన వారిలో కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల నుంచి సీహెచ్. అక్షయశ్రీ, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి ఎ.ఇష్రితా, కోఎడ్యుకేషన్ మహిళ ఇంజరింగ్ కళాశాల నుంచి ఎల్.అనిల్ కుమార్, వర్సిటీ ఫార్మసీ కళాశాల నుంచి పి.సందీప్‌లు ఉన్నారని ప్రొఫెసర్ ఈసం నారాయణ తెలిపారు.

నూతన హైకోర్టుకు అగ్రికల్చర్ వర్సిటీ భూములు ఇవ్వొద్దు

కేయూ క్యాంపస్, జనవరి 10: హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర నూతన హైకోర్టుకు అగ్రికల్చర్ వర్సిటీకి చెందిన భూములను కేటాయించడాన్ని విరమించుకోవాలని కేయూ ఏబీవీపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కేయూలో జరిగిన ఏబీవీపీ సమావేశంలో కేయూ ఏబీవీపీ అధ్యక్షుడు కె.ప్రశాంత్ మాట్లాడారు. వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 55ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మూగ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు

- రూ. 5 లక్షల 50 వేల జరిమానా

వరంగల్ లీగల్, జనవరి 10 : మూగ, మానసిక వికలాంగురాలైన బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 లక్షల 50వేల జరిమానా విధిస్తూ జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వై.సత్యేంద్ర బుధవారం తీర్పు వెలువరించారు. అదే విధంగా బాధితురాలికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ నుంచి రూ. 5 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలం మంగమ్మతోట మార్కండేయ నగర్‌కు చెందిన 14 సంవత్సరాల బాలిక పుట్టుకతోనే మూగ, మానసిక వికలాంగురాలు. ఎప్పటిలాగే బాధితురాలిని ఇంటి వద్ద ఉంచి 2019 నవంబరు 7న పనికి వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి సాయంత్రం 5 గంటలకు తిరిగి వచ్చారు. అప్పటికే ఏడుస్తున్న కూతురుని అడుగగా తనకు కడుపునొప్పిగా ఉందని వారికి సైగలతో చెప్పడంతో ఏమి జరిగిందని అడుగగా 6వ తేదీన మధ్యాహ్నం 3.15 గంటలకు ఒంటరిగా ఉన్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన తేజావత్ హచ్చు అలియాస్ రమేశ్ ఇంటిలోకి వచ్చి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపింది. గతంలో కూడా రెండు సార్లు అత్యాచారానికి పాల్పడినట్లు సైగల ద్వారా తల్లిదండ్రులకు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడి తేజావత్ రమేశ్‌కు 20 ఏళ్ల జైలుశిక్ష, రూ. 5 లక్షల 50 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.



చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి


సరోజన (ఫైల్)

సంగెం, జనవరి 10 : ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని గాయాలపాలైన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని నల్లబెల్లిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... నల్లబెల్లి గ్రామానికి చెందిన కూస సరోజన(66) ఈ నెల 4న ఇంటి ముందు వాకిలి ఊడుస్తుండగా పక్కనే ఉన్న పొయ్యిపై చీర కొంగు పడి మంటలు వ్యాపించాయి. దీంతో శరీరానికి గాయాలు కావడంతో స్థానికులు మంటలు ఆర్పివేశారు. హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి సరోజనను తరలించగా, సీరియస్‌గా ఉందని వెంటనే హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు చెప్పారన్నారు. దీంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఆమె మృతి చెందింది. భర్త రాజేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

శ్మశానవాటికల్లో వసతులు కరువు

కాలిబాటలు, గుంతలు, ముళ్లపొదలతో దర్శనం

• దహన సంస్కారాల కోసం ప్రజల ఇబ్బందులు • పట్టించుకోని మునిసిపల్ అధికారులు

ఖిలావరంగల్, జనవరి 10: వరంగల్ అండర్ రైల్వేగేట్ ప్రాంతంలో గల శ్మశానవాటికలు అధ్వానంగా ఉన్నాయి. శ్మశానవాటికలకు వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో పాటు ముళ్లపొదలు దర్శనమిస్తున్నాయి. అలాగే విద్యుత్ దీపాలు, బోర్లు, స్నానాల గదులు లేక దహన సంస్కారాల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన దారులు లేక ముళ్లపొదలు దాటుకుంటూ బంధువులు అనేక ఇబ్బందుల నడుమ మృతదేహానికి దహన సంస్కారాలు జరుపుతున్నారు. ఇక రాత్రి అయితే టార్చిలైటు, సెల్‌ఫోన్‌ల వెలుతురు మధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

వరంగల్ అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని రైల్వేగేట్, కరీమాబాద్, ఉర్సు, రంగశాయిపేట, శివనగర్, ఖిలావరంగల్ మెట్టుకోట, కుమ్మరికుంట, మాలఅగర్తల, తూర్పుకోట, చింతల్, పుప్పాలగుట్ట తదితర ప్రాంతాల్లోని శ్మశానవాటికల్లో కనీస వసతులు కరువయ్యాయని ప్రజలు వాపోతున్నారు. శ్మశాన ఘాట్‌లు, సరైన దారి, విద్యుత్ దీపాలు, బోరు ఏర్పాటు, స్నానాల గదులు, పిట్టగద్దె, తాగునీరు, చేతిపంపులు తదితర మౌలిక వసతులు లేవన్నారు. గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో కొన్ని శ్మశానవాటికలకు నిధులను కేటాయించి నిర్మించారు.

కానీ వెళ్లేందుకు రోడ్డు, విద్యుత్ దీపాలు, చేతిపంపులు, పిట్టగద్దె, మహిళలు స్నానం చేసి బట్టలు మార్చుకునేందుకు గదులు లేకపోవడం, కనీసం పిట్ట సమయంలో మృతుల బంధువులు కూర్చోవడానికి సిమెంట్ బల్లలు తదితర వసతులు లేకపోవడంతో దహన సంస్కారాలకు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత కార్పొరేషన్ అధికారులపై మండిపడుతున్నారు.

ఇటీవల ఖిలావరంగల్ మాలఅగర్తల చెరువు నుంచి శివనగర్ శ్మశానవాటిక నుంచి వర్షం, డ్రైయినేజీ నీరు వెళ్లేందుకు పనులు జరుగుతున్నాయి. ఆ శ్మశానవాటిక ప్రధాన ద్వారాన్ని తొలగించి దారిపై రెండు సెంట్రింగ్ రేకులను వేశారు. దీంతో ఈ మార్గం గుండా లోనికి వెళ్లేందుకు మృతుని బంధువులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పుప్పాలగుట్ట, చింతల్, ఖిలావరంగల్ మొట్టుకోట, మాలఅగర్తల, కుమ్మరికుంట, తూర్పుకోటలోని శ్మశానవాటికలకు వెళ్లేందుకు సీసీరోడ్డు కూడా లేదని చెబుతున్నారు.


శివనగర్‌లోని శ్మశానవాటిక దారిపై పర్చిన సెంట్రింగ్ రేకులు


పుప్పాలగుట్ట శ్మశానవాటికకు దారి లేని దృశ్యం


శివనగర్ శ్మశానవాటిక పక్కన ఇటీవల తవ్విన డ్రైయినేజీ గొయ్యి

మౌలిక వసతులు కల్పించాలి : అచ్చ వినోద్‌కుమార్, తూర్పుకోట



వరంగల్ అండర్ రైల్వేగేట్‌లోని అన్ని శ్మశానవాటికల వద్ద ఘాట్‌లు, రోడ్డు, స్నానాల గదులు, విద్యుత్ దీపాలు, బోర్‌లు, చేతిపంపులు, తాగునీరు, పిట్ట గద్దెలు, సిమెంట్ బల్లలు తదితర మౌలిక వసతులు లేక మృతుల బంధువులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నగరంలోని శ్మశానవాటికల వద్ద ప్రభుత్వం అన్ని వసతులను కల్పించాలి.

కార్పొరేషన్ నిధులను కేటాయించాలి : ఆకులపెల్లి యాకోబు, పడమరకోట



గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ మేయర్, కమిషనర్ అండర్ రైల్వేగేట్‌లోని శ్మశానవాటికలకు అధిక నిధులను కేటాయించాలి. కాలనీలలో పలువురు మృతి చెందిన సందర్భంలో వారి బంధువులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శ్మశానవాటికల వద్ద శ్మశానవాటిక ఘాట్‌లు, రోడ్లు, విద్యుత్ దీపాలు, బోర్‌లు, చేతిపంపులు తదితర మౌలిక వసతులను కల్పించాలి.

అర్హులైన వారందరికి అభయహస్తం : ఎంపీపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సౌజన్య

గీసుగొండ, జనవరి 10: అర్హులైన వారందరికి అభయ హస్తం ద్వారా ఆరు గ్యారంటీ స్కీంలను అందించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతుందని ఎంపీపీ భీమగాని సౌజన్య అన్నారు. గీసుగొండలోని కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం మహిళలు లబ్ధి పొందేందుకు ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇండ్లు లేని చోట సీసీ రోడ్లు, మిషన్ భగీరథ కనెక్షన్‌లు ఎలా ఇస్తారని అధికారులను ప్రశ్నించారు. అనధికార వెంచర్‌లపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు అభివృద్ధి తీరును వివరించారు. కాగా, విద్యుత్ మీటర్‌లపై గిరిజన తండాల్లో అవగాహన కల్పించి ప్రభుత్వం కల్పించే 200 యూనిట్‌ల సబ్సిడీ అందించే విధంగా చూడాలని కొమ్మాల ఎంపీటీసీ గోపాల్ సభ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రడం శ్రావ్యభరత్, ఎంపీడీవో వీరేశం, డీటీ ఉమారాణి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైలు పట్టాల వెంబడి పతంగులు ఎగురవేయొద్దు



రైల్వే పట్టాల పక్కన ఉన్న కాలనీ పిల్లలకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ ఎస్సై

గిర్మాజీపేట, జనవరి 10: రైల్వే పట్టాల వెంబడి పతంగులు ఎగురవేస్తే విద్యుదాఘాతానికి గురై ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ఆర్‌పీఎఫ్ వరంగల్ ఎస్సై జి.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం వరంగల్ ఆర్‌పీఎఫ్ సీఐ టి.కృష్ణ పర్యవేక్షణలో ఎస్సై వెంకటేశ్వర్లు, పలువురు కానిస్టేబుళ్లు వరంగల్ నుంచి చింతల్, దర్గా కాజీపేట వరకు రైలు పట్టాల వెంబడి ఉన్న పలు కాలనీలు, గుడిసెల బస్తీలకు వెళ్లి సంక్రాంతి సందర్భంగా పతంగులు ఎగురవేస్తున్న పిల్లలతో ముచ్చటించారు. రైలు పట్టాలపైన అత్యధిక ఓల్టేజీ విద్యుత్ వైర్లు ఉంటాయని, పతంగిలు గాలిలో ఎగురుతూ వైర్లకు తగిలితే వాటిని ఏ విధంగానూ తాకరాదని సూచించారు. ఒకవేళ తాకితే విద్యుదాఘాతానికి గురై ప్రాణాలకు ప్రమాదం జరుగుతుందని ఎస్సై వెంకటేశ్వర్లు పిల్లలకు వివరించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ పతంగులను రైలు పట్టాలకు సమీపంగా ఎగురవేయవద్దని అన్నారు. గాలిలో ఎగురుతూ పతంగి రైల్వే విద్యుత్ వైర్లకు తడితే వాటిని అలాగే వదిలివేయాలని పిల్లలకు చెప్పారు.

కన్నుల పండువగా అయ్యప్ప ఇరుముడులు


రంగశాయిపేట నుంచి ఇరుముడులతో శబరిమలైకి బయలుదేరిన అయ్యప్ప స్వాములు

శంభునిపేట, జనవరి 10: ఇరుముడి కట్టి శబరిమలైక్కి నెయ్యాభిషేకం మణికంఠుడికే.. అంటూ అయ్యప్ప స్వాములు ఇరుముడులు కట్టుకున్నారు. 41 రోజుల పాటు అయ్యప్ప దీక్ష తీసుకొని నియమ నిష్ఠలతో అయ్యప్పను ఆరాధించి దీక్షను పూర్తి చేసుకొని నగరంలోని రంగశాయిపేట రామాలయం, మహంకాళి దేవాలయంలో గురుస్వామి వెలిదె ప్రదీప్‌శాస్త్రి చేతుల మీదుగా బుధవారం అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో ఇరుముడులు కట్టుకున్నారు. అంతకుముందు ఆలయ పూజారి తిరుమల శ్రీధరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప దర్శనానికై వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక రైలులో శబరిమలైకి బయలుదేరారు. కన్నుల పండువగా సాగిన ఇరుముడుల ఉత్సవంతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శబరిమలైకి బయలుదేరిన వారిలో అయ్యప్ప స్వాములు కొండ్రెడ్డి నవీన్‌రెడ్డి, కావటి కర్ణాకర్, ఎలమకంటి రాంబాబు, నాసం ప్రవీణ్, కేశిపెద్ది సాయి భవిత్‌రాజు, వల్లపు మణి, పాల రంజిత్, కుంట్ల శ్రీధర్, సోమ మనోహర్, అజయ్, మర్క అశోక్, పేది నగేష్, పోశాల కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నేతల పరామర్శ


కుటుంబానికి బియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖిలావరంగల్, జనవరి 10: నగరంలోని 37వ డివిజన్ తూర్పుకోటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గటికొప్పుల కట్టమల్లు ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని పార్టీ నేతలు బుధవారం పరామర్శించారు. కుటుంబానికి క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బెడిద వీరన్న మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా కాంగ్రెస్ కార్యకర్తగా పార్టీ అభివృద్ధి కోసం కట్టమల్లు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో 37వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొయిని దూడయ్య, నాయకులు బిళ్ల రాంబాబు, బంగారి శ్రీనివాస్, బోయిని సారంగపాణి, మాదాసి మధు, ఎమ్డీ.ముఖభీర్, ఎమ్డీ.పాయిజ్, ఎమ్డీ.మోహిన్, తగరపు వేణు, రాజబోయిన రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖను కలిసిన కాంగ్రెస్ నేత

ఖిలావరంగల్, జనవరి 10: రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎల్.శ్రీనివాస్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసి తిరుపతి లడ్డు, క్యాలెండర్, డైరీని అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చింతలపల్లి రైల్వే ఎస్‌సీసీ మెంబర్‌గా రాంబాబు

గీసుగొండ, జనవరి 10 : చింతలపల్లి రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ(ఎస్‌సీసీ) మెంబర్‌గా ధర్మారం గ్రామానికి చెందిన గట్టికొప్పుల రాంబాబును నియమించారు. ఈ మేరకు బుధవారం రాంబాబుకు సికింద్రాబాద్ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ఐఎస్ఆర్ మూర్తి నియామక పత్రాన్ని అందచేశారు. చింతలపల్లి రైల్వేస్టేషన్ విస్తరణ, అభివృద్ధిలో రాంబాబు ఇచ్చే సూచనలు, సలహాలు తీసుకునేందుకు అవకాశం కల్పించినట్లు అందులో పేర్కొన్నారు. కాగా, ఆయన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా కొనసాగుతున్నారు. తనకు అవకాశం కల్పించటం పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, నాయకులు విజయ్‌చందర్‌రెడ్డి, కాళీప్రసాద్‌లకు రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

ఏఐటీయూసీ కేంద్ర కమిటీ కార్యదర్శి నర్ర ప్రతాప్


సమావేశంలో మాట్లాడుతున్న నర్ర ప్రతాప్

గిర్మాజీపేట, జనవరి 10: పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ వర్గాలకు దారాదత్తం చేస్తున్నదని అఖిల భారత కార్మిక సంఘాల కేంద్ర కమిటీ(ఏఐటీయూసీ) కార్యదర్శి నర్ర ప్రతాప్ ఆరోపించారు. ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో బుధవారం ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుడుం అనిల్‌కుమార్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నర్ర ప్రతాప్ మాట్లాడుతూ కార్మిక చట్టాలను సరిగా అమలు చేయడం లేదని, 8 గంటలకు బదులుగా 12 గంటల పని విధానం అమలు చేస్తున్నాయని విమర్శించారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదని ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వాటిని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పెద్దారపు రమేష్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు ఎస్.జగదీశ్వర్, జబ్బార్ నాయక్, దానయ్య, భద్రయ్య, శివాని, ఆశీర్వాదం, మోహన్ నాయక్, మహిపాల్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు

సమీక్షలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జనవరి 10: మిర్చి కొనుగోలులో గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో మార్కెటింగ్ అధికారులతో ఏనుమాముల మార్కెట్‌లో మిర్చి క్రయ విక్రయాలు, ధరలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే మూడు నెలల వరకు ఏనుమాముల మార్కెట్ యార్డుకు మిర్చి అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉంటూ నిత్యం పర్యవేక్షిస్తూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చూడాలని అన్నారు. మిర్చి నాణ్యత, తేమ శాతంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. తేమ శాతం తక్కువ ఉండేలా మిర్చిని ఆరబెట్టి మార్కెట్‌లో విక్రయించి రైతులు అధిక ధర పొందవచ్చని తెలిపారు. గత వారం మార్కెట్‌లో జరిగిన మిర్చి క్రయ విక్రయాలు, ధరల వ్యత్యాసంపై కలెక్టర్ సమీక్షించి 80 శాతం మిర్చి ధరలు క్వింటాల్‌కు రూ.20వేలకు పైగానే నమోదవుతున్నట్లు గమనించారు. రాష్ట్రంలోని వివిధ మార్కెట్లలో మిర్చి ధరలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దానికి అనుగుణంగా ఏనుమాముల మార్కెట్‌లో క్రయ విక్రయాలు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ మిర్చి వ్యాపారస్థులు తెలిపిన వివరాల ప్రకారం ప్రతీ సంవత్సరం ఇండోనేషియా, బంగ్లాదేశ్, చైనా దేశాలకు మిర్చి ఎగుమతి జరుగుతుందని, ప్రస్తుతం ఆ దేశాల నుంచి ఎలాంటి ఆర్డర్స్ లేవని తెలిపారన్నారు. రైతులు తమకు గిట్టుబాటు ధర రాలేదని భావించినచో వ్యవసాయ మార్కెట్‌లో గల కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసి రైతు బంధు పథకం కింద ఆరు నెలల వరకు ఎలాంటి వడ్డీ లేకుండా రూ.2లక్షల వరకు రుణాన్ని పొందే అవకాశం సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. తరచూ మార్కెట్‌ను సందర్శిస్తూ మిర్చి క్రయ విక్రయాలపై పర్యవేక్షించి నివేదించాల్సిందిగా ఆర్‌డీవో వాసుచంద్రను ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా మార్కెటింగ్ అధికారి పి.ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

మిర్చి ధర తగ్గకుండా చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి) : ఎండు మిర్చి ధరలు పడిపోకుండా, రైతులు ఇబ్బందులకు గురికాకుండా మార్కెట్ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి సూచించారు. అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, జాయింట్ డైరెక్టర్ వి.శ్రీనివాస్, వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ అజ్మీరా రాజుతో పాటు వరంగల్, ఖమ్మం మార్కెట్ కమిటీల కార్యదర్శులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. మిర్చి ధర తగ్గటానికి గల కారణాలపై ఆరా తీశారు. అడ్తిదారులు, కొనుగోలుదారులతో, ఇతర మార్కెట్ వినియోగదారులతో సంప్రదింపులు జరుపుతూ గిట్టుబాటు ధర పొందేలా చొరవ చూపాలని మార్కెట్ కార్యదర్శులను ఆదేశించారు. గిట్టుబాటు ధర లేకపోతే.. శీతల గిడ్డంగుల్లో మిర్చి నిల్వ చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని, రైతుబంధు పథకం కింద రూ.2 లక్షల వరకు ఆరు నెలల వరకు వడ్డీలేని రుణం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డుల్లో మైకుల ద్వారా నిత్యం ప్రచారం నిర్వహించాలని, కరపత్రాలు పంపిణీ చేయాలని, పత్రికలు, ఇతర మాధ్యమాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని డైరెక్టర్ సూచించారు. మార్కెట్ యార్డుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను లక్ష్మీబాయి ఆదేశించారు.

అగ్రంపహాడ్ జాతరకు ఏర్పాట్లు చేయండి

సమీక్షలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

హనుమకొండ రూరల్, జనవరి 10 : అగ్రంపహాడ్ సమ్మక్క, సారలమ్మ జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆత్మకూరు మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క, సారలమ్మ జాతరపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతరకు వచ్చే ఏ ఒక్క భక్తుడు ఇబ్బంది పడకుండా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. జాతరకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతర సమయంలో పారిశుధ్య నిర్వహణ, భక్తులకు తాగునీరు, స్నానాల కోసం నీటి సౌకర్యం, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల పార్కింగ్, విద్యుత్ ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. ఆర్టీసీ బస్ సర్వీసులను పెంచి, తగినన్ని సీసీ కెమెరాలు సిద్ధం చేయాలని తెలిపారు. జాతరలో ప్లాస్టిక్ వినియోగించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. అగ్రంపహాడ్ జాతరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ విజయవంతం చేయాలన్నారు. ఫిబ్రవరి 18వ తేదీ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు. జాతరకు మహిళలు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గ ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్‌జీ, డీసీపీ రవీందర్, పరకాల ఆర్‌డీవో శ్రీనివాస్, ఏసీపీ కిశోర్ కుమార్, దేవాదాయ, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, అగ్నిమాపక, ఆర్ అండ్ బీ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

వరంగల్ టౌన్, జనవరి 10: నగరంలోని కాశిబుగ్గలో గల శ్రీ కాశీవిశ్వేశ్వరాలయంలో బుధవారం మాస శివరాత్రి, మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, చండీహవనం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ కాశీవిశ్వేశ్వరుడికి అన్నపూజ, అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో ఓరుగంటి కొండయ్య, బొమ్మిగాని క్రిష్ణమూర్తి, నాగమళ్ల ఓంకారేశ్వర్, ఉమాశంకర్, దయాసాగర్, పెద్దన్న, సతీష్, అంకమ్మరావు తదితరులు పాల్గొనగా, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు గుండేటి నరేంద్రకుమార్, బయ్య స్వామి, గోనె జగదీశ్వర్, మండల శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించారు.

మధ్యప్రదేశ్ మాజీ సీఎంను కలిసిన బీజేపీ నేతలు

మామునూరు, జనవరి 10: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాలను సందర్శించడానికి వచ్చిన మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను పలువురు బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పరకాల నియోజకవర్గంలోని దామెర మండలంలో చేపట్టిన కార్యక్రమంలో శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డిలతో పాటు పార్టీ నియోజకవర్గ నాయకుడు కుమారస్వామి తదితరులు కలిశారు. శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం వరంగల్ నగర పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝూను కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.


శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసిన తిరుపతిరెడ్డి

రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కేఆర్‌కే రెడ్డి


వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న పీసీసీఎం కేఆర్‌కే రెడ్డి

గిర్మాజీపేట, జనవరి 10 : వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కె.రవిన్‌కుమార్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎం.బస్వరాజుతో కలిసి వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. మొదటి ప్లాట్‌ఫారంపై ఆర్‌పీఎఫ్ ఠాణాకు ఎదురుగా నూతనంగా లిఫ్ట్, ఎస్కలేటర్‌ల ఏర్పాటును ఇంజనీరింగ్ అధికారులు పీసీసీఎం కేఆర్‌కే రెడ్డికి వివరించారు. అలాగే ప్రస్తుతం ఉన్న ఆర్‌పీఎఫ్ ఠాణాను పార్సిల్ ఆఫీసు కార్యాలయం వద్ద నూతన భవనం నిర్మించి అక్కడకు మార్చనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ప్రస్తుత సాధారణ ప్రయాణీకుల విశ్రాంతి మందిరాన్ని ఫోరింగ్, టాప్, అధునాతన టాయిలెట్ల నిర్మాణంను అధికారులు ఆయనకు వివరించారు. అలాగే రైల్వేస్టేషన్ ముందు భాగంలో చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. రైల్వే ఏడీఈఎన్ చౌదరి వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి నమూనాను, జరుగుతున్న పనుల తీరును కేఆర్‌కే రెడ్డికి వివరించారు. కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మేనేజర్ బి.బాలరాజు, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ బాదావత్ రాజ్‌గోపాల్, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ వి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పీసీసీఎం కేఆర్‌కే రెడ్డి, సీనియర్ డీసీఎం బస్వరాజులు నెక్కొండ, కేసముద్రం రైల్వేస్టేషన్‌లను సందర్శించి అక్కడి నుంచి వ్యవసాయ ఉత్పత్తులు రైళ్ల ద్వారా మార్కెటింగ్ ప్రాంతాలకు వెళ్లేలా సహకరించాలని వ్యాపారులతో సమావేశమై కోరినట్లు తెలిసింది.

ఆర్టీసీ సిబ్బందికి అవార్డులు

నర్సంపేట, జనవరి 10 : విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ జ్యోతికి బుధవారం డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి అవార్డును అందించి అభినందించారు. అదేవిధంగా పలువురు డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో సహాయ మేనేజర్ భవాని, సూపరింటెండెంట్ వెంకటదాస్‌రెడ్డి, ఎన్‌వీ రెడ్డి, శ్రీనివాస్‌రావు, రాజు పాల్గొన్నారు.


నర్సంపేట డిపోలో కండక్టర్ జ్యోతికి అవార్డు పత్రం అందిస్తున్న డీఎం ప్రసూనలక్ష్మి

సంఘటిత పోరాటాలతోనే విజయం

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు

నెక్కొండ, జనవరి 10: కార్మికుల హక్కుల సాధనకు గాను సంఘటితంగా పోరాటాలు చేసినప్పుడే విజయం సాధిస్తామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు అన్నారు. నెక్కొండలోని ప్రభుత్వ అతిథి గృహంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలీల రేట్లను పెంచాలన్నారు. లేబర్ కార్డులను కలిగి ఉన్న కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు పైబడిన కార్మికులకు పింఛన్ ఇవ్వాలన్నారు. సమావేశంలో రెయిన్‌బో పెయింటర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు కందిక శ్రీనివాస్, కార్యదర్శి ఈదునూరి దిలీప్, కోశాధికారి సింగం ప్రశాంత్, గౌరవ అధ్యక్షుడు తాటికాయల యాకయ్య, లైశెట్టి వినయ్, ఈదునూరి అనిల్, మైదం రాజు, ఒద్దూరి సంపత్, సింగం కర్ణాకర్, పొలిశెట్టి విజయ్, దంతాల శ్యాం పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు, స్టడీ మెటీరియల్ పంపిణీ

చెన్నారావుపేట, జనవరి 10: మండలంలోని ఉప్పరపల్లి గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం సైకిళ్లు, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యులు మండ వేణు, పి.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న 23 మంది విద్యార్థులకు రూ.1లక్ష విలువ చేసే సైకిళ్లను , అలాగే పదోవ తరగతి చదువుతున్న 31 విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందిచటం జరిగిందన్నారు. గత విద్యా సంవత్సరంలోను రోటరీ క్లబ్ తరుపున లాప్‌ట్యాబ్‌ను, సైకిళ్లను అందించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయ, ఇంద్రసేనారెడ్డి, శశిధర్, మాధవి, సుందర్, మాధవి, టి.మురళి, రవిందర్, మోహన్‌రావు, చింతకింది ఇందిర, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మద్దిమేడారం పనులను వేగవంతం చేయాలి

నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి

నల్లబెల్లి, జనవరి 10: మండలంలోని మద్దిమేడారం సమ్మక్క-సారలమ్మ జాతర పనులను వేగవంతం చేయాలని నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి అన్నారు. బుధవారం నాగరాజుపల్లి శివారులోని మద్దిమేడారంకు ఆర్డీవోతో పాటు అధికారులు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు వెళ్లారు. ఆర్డీవో కృష్ణవేణి మద్దిమేడారం ప్రధాన పూజారులు దురుశెట్టి సమ్మయ్య, నాగరాజుల సమక్షంలో సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద టెంకాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. మద్దిమేడారం జాతరకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా విశాలమైన రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే జాతరలో తాగునీటి కొరత లేకుండా పూర్తి సౌకర్యాలను కల్పించాలన్నారు. అంతేకాక మద్దిమేడారంలో పనులను వేగవంతం చేస్తూ అన్ని సదుపాయాలను కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ మాల్యాల కిషన్, తహసీల్దార్ బొనగాని రాజేష్, ఎంపీడీవో విజయ్ కుమార్, సర్పంచ్ గోనె శ్రీదేవి, నాయకులు చిట్యాల తిరుపతిరెడ్డి, గందె శ్రీనివాస్ గుప్తా, చిట్యాల సీతారాంరెడ్డి, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మద్దిమేడారంలో సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద టెంకాయ కొడుతున్న ఆర్డీవో కృష్ణవేణి

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు

వర్ధన్నపేట రూరల్, జనవరి 10 : మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసారు. వరంగల్ పార్లమెంటు స్థాయి సన్నాహక సమావేశంలో పాల్గొన్న కేటీఆర్‌ను వర్ధన్నపేట మండలం నుంచి వెళ్లిన కుమారస్వామి కలిసి పార్టీ స్థితిగతులపై వివరించినట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతిలు ఉన్నారు.


తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌తో తూళ్ల కుమారస్వామి

సమావేశానికి తరలిన బీఆర్ఎస్ నేతలు

రాయపర్తి : హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటు విస్తృత స్థాయి సమావేశానికి మండల నాయకులు తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ బిల్లా సుధీర్‌రెడ్డి, మార్కెట్ మాజీ డైరెక్టర్ నయీంలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

రాయపర్తి, జనవరి 10 : మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ నిర్వహించే వారిని గుర్తించి ఈ నెల 17న వారందరికీ ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రావుల అనిల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ బుద్ద సునీల్‌కుమార్, మందాటి సుదర్శన్‌రెడ్డి, కృష్ణరెడ్డి, సర్పంచ్ గారె నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


రాయపర్తిలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

అగ్రంపహాడ్ జాతరకు ఏర్పాట్లు చేయండి

సమీక్షలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

హనుమకొండ రూరల్, జనవరి 10 : అగ్రంపహాడ్ సమ్మక్క, సారలమ్మ జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆత్మకూరు మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క, సారలమ్మ జాతరపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతరకు వచ్చే ఏ ఒక్క భక్తుడు ఇబ్బంది పడకుండా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. జాతరకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతర సమయంలో పారిశుధ్య నిర్వహణ, భక్తులకు తాగునీరు, స్నానాల కోసం నీటి సౌకర్యం, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల పార్కింగ్, విద్యుత్ ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. ఆర్టీసీ బస్ సర్వీసులను పెంచి, తగినన్ని సీసీ కెమెరాలు సిద్ధం చేయాలని తెలిపారు. జాతరలో ప్లాస్టిక్ వినియోగించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. అగ్రంపహాడ్ జాతరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ విజయవంతం చేయాలన్నారు. ఫిబ్రవరి 18వ తేదీ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు. జాతరకు మహిళలు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గ ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్‌జీ, డీసీపీ రవీందర్, పరకాల ఆర్డీవో శ్రీనివాస్, ఏసీపీ కిశోర్ కుమార్, దేవాదాయ, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, అగ్నిమాపక, ఆర్ అండ్ బీ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరాలయంలో వైభవంగా దీపోత్సవం


నర్సంపేటలోని వెంకటేశ్వరాలయంలో మహిళలు వెలిగించిన దీపాలు

నర్సంపేట, జనవరి 10 : పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి ఆలయ చైర్మన్ ఆధ్వర్యంలో అర్చకుడు రామానుజచార్య వేదమంత్రోచ్చరణల నడుమ ధనుర్మాస ఆండాళ్‌గోదా అమ్మవారికి పారాయణ కార్యక్రమం చేపట్టి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి హారతులిచ్చి దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. వికాసతరంగిణి బాధ్యులు దాస్యం రంగనాథస్వామి, రూపావతి దంపతులు గోదా అమ్మవారికి చీర, గాజులు, ఓడిబియ్యం, పసుపు, కుంకుమ, పూలు అందించి ఒకరికొకరు వాయినాలను ఇచ్చిపుచ్చుకొని మహిళలు విష్ణునామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, వేమిశెట్టి శ్రీనివాస్, రమాదేవి, చింతల నిరంజన్, యాకయ్య, సుకన్య, మర్ధ మణెమ్మ, లక్ష్మి, రేణుక, కల్పన, స్వరూప. వసంత, సంధ్య, శైలజ, సుప్రజ, స్వప్న, స్రవంతి, జ్యోతి పాల్గొన్నారు.

12న పట్టుబడిన వాహనాలకు వేలంపాట

నర్సంపేట టౌన్, జనవరి 10 : నర్సంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 14 వాహనాలకు ఈ నెల 12న స్థానిక ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ ఆర్.నరేష్‌రెడ్డి బుధవారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతో 12న ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

మోటార్ వాహన చట్టసవరణ సరైంది కాదు

నర్సంపేట, జనవరి 10 : మోటార్ వాహన చట్టసవరణ సరైంది కాదని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, డివిజన్ అధ్యక్షుడు గూబల సుధాకర్, ప్రధాన కార్యదర్శి సకినాల రవి అన్నారు. కేంద్ర ప్రభుత్వం మోటార్ వాహన చట్టసవరణ చేస్తూ డ్రైవర్లను బాధ్యుడిగా చేస్తూ వేలాది రూపాయల చలాన్లు కట్టిస్తూ జైలుశిక్షను వ్యతిరేకిస్తూ గురువారం దేశవ్యాప్త సమ్మెలో నర్సంపేట నియోజకవర్గంలోని వాహన డ్రైవర్లు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. సమ్మెను పురస్కరించుకొని బుధవారం తెలంగాణ ప్రైవేటు బస్‌డ్రైవర్స్ క్లీనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం ట్రస్మా డివిజన్ అధ్యక్షుడు వి.రమేశ్‌కు వినతిపత్రం అందజేశామని వారు అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల డ్రైవర్లు వీధిన పడే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో ప్రకాశ్, నాగరాజు, సంపత్, ఖాసీం, కిరణ్, కుమార్, సాగర్, రమేశ్, మోహన్, రాజేందర్, కుమారస్వామి, రాజ్‌కుమార్, సందీప్, వెంకన్న, రాజు, వినయ్, సురేశ్, రహీం, కేదారి పాల్గొన్నారు.

ఆటో యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

చెన్నారావుపేట, జనవరి 10 : మండలంలోని పాపయ్యపేట గ్రామ ఆటో యూనియన్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా కన్నం విజయ్, ఉపాధ్యక్షుడిగా గుండె చంటి, కార్యదర్శిగా కొల్లపల్లి రాజు, సహాయ కార్యదర్శిగా గుర్రం రవి, కార్యవర్గ సభ్యులుగా నూనె స్వామి, బానోతు ప్రవీణ్, ముత్యాల సారంగం, గౌరవ అధ్యక్షులుగా కన్నం వెంకన్న, అబ్బదాసి భాస్కర్, మహేందర్, రాకేష్‌లను ఎన్నుకున్నారు.

13 నుంచి డివిజన్ స్థాయి గ్రామీణ క్రీడోత్సవాలు

దుగ్గొండి, జనవరి 10: మండలంలోని నాచినపల్లి గ్రామంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో డివిజన్ స్థాయి గ్రామీణ క్రీడోత్సవాలను డీవైఎఫ్ఐ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు పొన్నం రాజు, కార్యదర్శి బొల్ల ప్రశాంత్ బుధవారం తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, షటిల్ క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్రీడలలో దుగ్గొండి, నల్లబెల్లి, నర్సంపేట, ఖానాపురం, చెన్నారావుపేట, నెక్కొండ మండలాలకు చెందిన కీడాకారులు పాల్గొనాలని తెలిపారు. కబడ్డీలో ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.8వేలు, తృతీయ బహుమతి రూ.6వేలు, నాలుగో బహుమతి రూ.4వేలు, వాలీబాల్‌లో ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ రూ.3వేలు, షటిల్‌లో ప్రథమ బహుమతి రూ.4వేలు, ద్వితీయ బహుమతి రూ.2వేలు అందించనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ కార్యవర్గం ఎన్నిక

నర్సంపేట టౌన్, జనవరి 10: నర్సంపేట డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీని పట్టణంలోని పద్మశాలి గార్డెన్స్‌లో బుధవారం జరిగిన సమావేశంలో సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేరుగు మోహన్, ప్రధాన కార్యదర్శిగా కె.రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా పొలసాని రవిలు ఎన్నికయ్యారు. అలాగే గౌరవ అధ్యక్షుడిగా గొడిశాల సదానందం, ఉపాధ్యక్షుడిగా మహాదేవుని జగదీష్, సహాయ కార్యదర్శిగా నల్ల వంశీధర్‌రెడ్డి, ముఖ్య సలహాదారులుగా బొందలపాటి కిరణ్, ఎర్రబెల్లి విద్యాసాగర్, ఊరటి రాజు, తాళ్ల సురేందర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా సొదారపు మధు, కార్యవర్గ సభ్యులుగా సొనబోయిన రాజు, సంగినేని ప్రశాంత్, గాండ్ల ప్రదీప్, హింగె రాజు, దొమ్మటి ప్రవీణ్‌లు ఎన్నికయ్యారు.


అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులుగా ఎన్నికైన మోహన్, రాజేంద్రప్రసాద్, రవి

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు

సమీక్షలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, జనవరి 10: మిర్చి కొనుగోలులో గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో మార్కెటింగ్ అధికారులతో ఏనుమాముల మార్కెట్‌లో మిర్చి క్రయ విక్రయాలు, ధరలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే మూడు నెలల వరకు ఏనుమాముల మార్కెట్ యార్డుకు మిర్చి అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉంటూ నిత్యం పర్యవేక్షిస్తూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చూడాలని అన్నారు. మిర్చి నాణ్యత, తేమ శాతంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. తేమ శాతం తక్కువ ఉండేలా మిర్చిని ఆరబెట్టి మార్కెట్‌లో విక్రయించి రైతులు అధిక ధర పొందవచ్చని తెలిపారు. గత వారం మార్కెట్‌లో జరిగిన మిర్చి క్రయ విక్రయాలు, ధరల వ్యత్యాసంపై కలెక్టర్ సమీక్షించి 80 శాతం మిర్చి ధరలు క్వింటాల్‌కు రూ.20వేలకు పైగానే నమోదవుతున్నట్లు గమనించారు. రాష్ట్రంలోని వివిధ మార్కెట్లలో మిర్చి ధరలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దానికి అనుగుణంగా ఏనుమాముల మార్కెట్‌లో క్రయ విక్రయాలు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ మిర్చి వ్యాపారస్తులు తెలిపిన వివరాల ప్రకారం ప్రతీ సంవత్సరం ఇండోనేషియా, బంగ్లాదేశ్, చైనా దేశాలకు మిర్చి ఎగుమతి జరుగుతుందని, ప్రస్తుతం ఆ దేశాల నుంచి ఎలాంటి ఆర్డర్స్ లేవని తెలిపారన్నారు. రైతులు తమకు గిట్టుబాటు ధర రాలేదని భావించినచో వ్యవసాయ మార్కెట్‌లో గల కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసి రైతు బంధు పథకం కింద ఆరు నెలల వరకు ఎలాంటి వడ్డీ లేకుండా రూ.2లక్షల వరకు రుణాన్ని పొందే అవకాశం సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. తరచూ మార్కెట్‌ను సందర్శిస్తూ మిర్చి క్రయ విక్రయాలపై పర్యవేక్షించి నివేదించాల్సిందిగా ఆర్డీవో వాసుచంద్రను ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా మార్కెటింగ్ అధికారి పి.ప్రసాద్‌రావు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

మిర్చి ధర తగ్గకుండా చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): ఎండు మిర్చి ధరలు పడిపోకుండా, రైతులు ఇబ్బందులకు గురికాకుండా మార్కెట్ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి సూచించారు. అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, జాయింట్ డైరెక్టర్ వి.శ్రీనివాస్, వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ అజ్మీరా రాజుతో పాటు వరంగల్, ఖమ్మం మార్కెట్ కమిటీల కార్యదర్శులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. మిర్చి ధర తగ్గటానికి గల కారణాలపై ఆరా తీశారు. అడ్తిదారులు, కొనుగోలుదారులతో, ఇతర మార్కెట్ వినియోగదారులతో సంప్రదింపులు జరుపుతూ గిట్టుబాటు ధర పొందేలా చొరవ చూపాలని మార్కెట్ కార్యదర్శులను ఆదేశించారు. గిట్టుబాటు ధర లేకపోతే.. శీతల గిడ్డంగుల్లో మిర్చి నిల్వ చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని, రైతుబంధు పథకం కింద రూ.2 లక్షల వరకు ఆరు నెలల వరకు వడ్డీలేని రుణం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డుల్లో మైకుల ద్వారా నిత్యం ప్రచారం నిర్వహించాలని, కరపత్రాలు పంపిణీ చేయాలని, పత్రికలు, ఇతర మాధ్యమాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని డైరెక్టర్ సూచించారు. మార్కెట్ యార్డుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను లక్ష్మీబాయి ఆదేశించారు.

డీటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ


డీటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

చెన్నారావుపేట, జనవరి 10 : మండలంలోని జల్లి గ్రామంలో మండల డీటీఎఫ్ నూతన క్యాలెండర్, డైరీలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు అంగోతు భద్రయ్య మాట్లాడుతూ మండలంలో మూతపడిన పాఠశాలలను ప్రభుత్వం తిరిగి ప్రారంభించటం హర్షనీయమన్నారు. ఉపాధ్యాయ రంగ సమస్యలను వెంటనే పరిష్కరించడానికి డీటీఎఫ్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ఉమాశంకర్, కొమురయ్య, కట్ట స్వామి, వెంకటేశ్వర్లు, సుధాకర్, నల్ల రవి, ఈర్య కుమారస్వామి, వెంకన్న, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి స్నేహితుల చేయూత

పర్వతగిరి, జనవరి 10 : మండల కేంద్రానికి చెందిన నీరటి వీరన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబానికి పదవ తరగతి పూర్వవిద్యార్థులు చేయూతనందించారు. ఆయనతో చదువుకున్న 1992-93 బ్యాచ్ విద్యార్థులు రూ.15వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, జూల్లపెల్లి రత్నాకర్‌రావు, గుర్రం యాదగిరి, వేమూరి సోమేశ్వర్, నీరటి సదానందం, సరుకుడు రవీందర్, బుద్ద కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కృష్ణ

రాయపర్తి, జనవరి 10 : పాలకుర్తి నియోజకవర్గ బహుజన సమాజ్‌వాది పార్టీ ఇన్‌చార్జిగా చిలుముల కృష్ణను నియమిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని కృష్ణకు బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు జనగామ జిల్లాలో జరిగిన నియోజకవర్గ, మండల, గ్రామాలలో నూతన కమిటీలను నియమించారని తెలిపారు. అందులో భాగంగా నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ తనపై నమ్మకంతో అప్పగించిన పనులను సక్రమంగా నిర్వర్తించి పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో నిర్మాల రత్నం, భాస్కర్‌కుమార్, మహేందర్, శ్రీశైలం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


చిలుముల కృష్ణకు నియామక పత్రాన్ని అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

ఏఐటీయూసీ కేంద్ర కమిటీ కార్యదర్శి నర్ర ప్రతాప్

గిర్మాజీపేట, జనవరి 10: పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ వర్గాలకు దారాదత్తం చేస్తున్నదని అఖిల భారత కార్మిక సంఘాల కేంద్ర కమిటీ(ఏఐటీయూసీ) కార్యదర్శి నర్ర ప్రతాప్ ఆరోపించారు. ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో బుధవారం ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుడుం అనిల్‌కుమార్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నర్ర ప్రతాప్ మాట్లాడుతూ కార్మిక చట్టాలను సరిగా అమలు చేయడం లేదని, 8 గంటలకు బదులుగా 12 గంటల పని విధానం అమలు చేస్తున్నాయని విమర్శించారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదని ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వాటిని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పెద్దారపు రమేష్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు ఎస్.జగదీశ్వర్, జబ్బార్ నాయక్, దానయ్య, భద్రయ్య, శివాని, ఆశీర్వాదం, మోహన్ నాయక్, మహిపాల్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్ర ప్రతాప్

విద్యార్థిని చితకబాదిన ఘటనపై విచారణ జరపాలి

నర్సంపేట టౌన్, జనవరి 10 : నర్సంపేట పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థిని పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ చితకబాదిన ఘటనపై విచారణ జరిపించాలని కోరుతూ గురుకుల సందర్శనకు విచ్చేసిన ఆర్‌సీవో డీఎస్.వెంకన్నకు బుధవారం విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ మాట్లాడుతూ గురుకుల విద్యార్థినిని అకారణంగా చితకబాదడంతో పాటు అనుచిత వ్యాఖ్యలు చేశారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేష్, ఎంఎస్ఎఫ్ నాయకుడు చింతం సిద్దు పాల్గొన్నారు.

దళిత బంధుకు నిధులు విడుదల చేయాలి

నెక్కొండ, జనవరి 10 : గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకానికి నిధులను విడుదల చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు బుధవారం వినతి పత్రాన్ని అందించారు. నెక్కొండలో దళితబంధు పథకంకు ఎంపిక చేసిన లబ్ధిదారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో అధికారుల సమక్షంలో దళిత బంధు పథకం కోసం ఎంపికైన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి వివక్షత చూపకుండా అందించాలని వారు కోరారు. దళితులు ఆర్థికంగా వెనుకబడటంతో దళిత కుటుంబాలు దుర్భర జీవితం గడుపుతున్నాయంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులు ఈదునూరి యాకయ్య, ఈదునూరి రమేశ్, మాతంగి రాజు, ఈదునూరి వెంకన్న, కందిక శ్రీనివాస్, కోర్లపాటి ప్రభాకర్, తడుగుల జనార్ధన్, మైదం రాజు, తాటికాయల యాకయ్య కొంగర రవి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.